# మనవే'మన పద్యాలు

ఆ. వె. చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోనిపోరు నింతింత గాదయా
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** :

జోరీగ = కందిరీగ, పెద్దదైన ఈగ.

నలుసు = నలక, రేణువు.

పోరు = కలహము, యుద్ధము, స్పర్థ.

**తాత్పర్యము** : చెప్పులో రాయి ఇరుక్కున్నప్పుడు, చెవి దగ్గరలో జోటీగ చేసే జోఱు శబ్దము, కంటిలో నలుసు పడినప్పుడు, కాలిలో ముల్లు గుచ్చుకుని ఉన్నప్పుడు ఏమీ తోచని పరిస్థితి ఏర్పడుతుంది. చివరికి ఆ బాధనుండి బయటపడితే తప్ప వేరే వాటిమీదకి దృష్టి పోదు. అటులనే ఇంటిలో పరిస్థితులు సవ్యముగా లేకపోతే దాని పర్యవసానము, పైన ఉదహరించిన సందర్భములకు భిన్నము కాదని అర్థము. ఇక్కడ ఇల్లు అనగా 'జీవుడు నివాసముండే శరీరము' అనే అర్థములో కూడా వాడబడింది. ఇంద్రియ నిగ్రహము కుదరక అనుక్షణము కోరికలతో, అరిషడ్వర్గముల పోరుతో జీవుడు పడే యాతన కూడా పైన తెల్పిన సందర్భముల మాదిరిగానే చికాకును కలిగిస్తాయని తాత్పర్యము.

ఆ. వె. జనన మరణవేళ స్వాతంత్ర్య హీనుండు
మొదట కర్తగాడు తుదనుగాడు
నడుమ కర్తననుట నగుబాటుగాదొకో
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** : నగుబాటు = పరిహాసపాత్రము

**తాత్పర్యము**: మనిషి అతని పుట్టుక విషయములోగాని, మరణము విషయములోగాని ప్రమేయము లేనివాడు. అవి అతని నిర్ణయముమీద ఎంతమాత్రమూ ఆధారపడవు. అనగా పుట్టుకవిషయములో గాని, మరణము విషయములో గాని అతని నిమిత్తము శూన్యము. వాటిని నిర్ణయించువాడు అతడు కాడు. మరి జననానికి, మరణానికి మధ్య అన్నిటికి తానే ఆధ్యుడనని విఱ్ఱవీగుట నగుబాటు కదా! జనన మరణాలని ఎవరైతే నిర్ణయిస్తున్నారో వారే మధ్యలోకూడా మన మనుగడకు కారణమని తెలియలేకపోవడం వెఱ్ఱితనమే కదా!